

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పోలింగ్ నిర్వహణకు

## ఆఫీసర్లదే కీలకపాత్ర

**కృష్ణ కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణ-గుంటూరు పట్టభద్రులు నియోజవర్గం శాసనమండలికి ఈనెల 27వ తేదీన జిల్లాలో నిర్వహించే పోలింగ్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, తహసిల్దార్లకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ సెంటర్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డికె బాలాజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా సక్రమంగా నిర్వహించడంలో సెక్టర్ అధికారులతో పాటు పోలింగ్, ఇతర అధికారులు సిబ్బందిది కీలకమన్నారు. పూర్తిగా బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించే ఈ పోలింగ్ ఎన్నికల సంఘం నియమ నిబంధనలు, మార్గదర్శకాలను పూర్తిగా చదివి మిగతా 2లో

సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 13 ఫిబ్రవరి 2025
పేజీలు 8

# దినసరి వేతనం రూ.300లు

**ఉపాధి హామీ పథకం ప్రతి అంశంలోనూ పురోగతి కనిపించాలి**

**సిబ్బంది పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం ద్వారా కూలీలు దినసరి సగటు వేతనం రూ. 300 హక్కుగా పొందేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టేలా వ్యవహరించాలని, ప్రతి గ్రామ పంచాయతీలోనూ పురోగతి కనిపించాలని, సిబ్బంది పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలం వారీగా, గ్రామపంచాయతీ వారీగా చేపడుతున్న పనులు, హాజరవుతున్న కూలీలు, సగటు వేతనం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది జనవరితో పోల్చితే ఫిబ్రవరి నాటికి కొన్ని మండలాలు, గ్రామపంచాయతీల్లో సగటు వేతనంలో పెరుగుదల కనిపించిందని, పథకం అమల్లో మిగిలిన మండలాలు, గ్రామపంచాయతీలు కూడా లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్రియాశీలంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

**ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి:** రాష్ట్ర పారిశ్రామిక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) సర్వేలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా. 2



## తక్కువ వ్యయంతో

### అధిక దిగుబడులు సాధించాలి

రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** పంటల సాగు వ్యయాన్ని తగ్గించి, అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయాలు పొందాలనే లక్ష్యంతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. మిగతా 2లో...

# విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ

**అప్రమత్తమైన పశు సంవర్ధక శాఖ అధికారులు**

**65వ జాతీయ రహదారి గరికపాడు వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు**

**తెలంగాణా నుండి ఆంధ్రలోకి వస్తున్న కోళ్ళ వ్యాన్ లను నిషేదించిన అధికారులు**



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** బర్డ్ ఫ్లూతో కోళ్లు మరణిస్తున్నాయనే విషయం విధితమే. ఈ సందర్భంగా తెలంగాణలోని కోళ్లపెంపకం కేంద్రాల నుండి నుండి కోళ్ల వ్యాన్‌లు ఆంధ్రాలోకి రాకుండా 65వ జాతీయ రహదారి మండలంలో గరికపాడు వద్ద చెక్ పోస్ట్ ను పశు సంవర్ధక శాఖ అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది. బర్డ్ ఫ్లూ విజృంభించడం వల్ల తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్రానికి కోళ్లను అనుమతించేది లేదని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఆ వ్యాధి సోకిన కోళ్లను ప్రజలు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అధికారులు తెలిపారు. ఆంధ్రాలోకి ప్రవేశించకుండా నిరోధించుటకు పలు జాగ్రత్త చర్యలు షిఫ్ట్‌ల వారికి విధులు నిర్వహణకు ఉద్యోగులను నియమించడం జరిగిందని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న చికెన్ షాప్ యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని షాపుల్లో చికెన్ అమ్మడం నిలిపివేయాలని అధికారులు సూచించారు. చికెన్ షాపుల్లో కోళ్లు 2లో

(మొదటిపేజీ తరువాయి)



## దినసరి వేతనం రూ.300లు

జి.లక్ష్మీశ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. పోటీతత్వ, ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం, పారిశ్రామిక యూనిట్ల అవసరాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో సాంకేతిక వినియోగం, నిర్వహణ నైపుణ్యాల్లో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు కూడా సర్వే ఫలితాలు దోహదం చేస్తాయన్నారు. ఇప్పటివరకు 28,816 యూనిట్ల సర్వే పూర్తయిందని, మిగిలినవాటి సర్వేను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సర్వేను వేగవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి మార్గనిర్దేశనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదేవిధంగా పీఎం విశ్వకర్మ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నరేగా-పల్లెపండగ కింద పశువుల షెడ్లకు సంబంధించి 746 పనులు మంజూరు కాగా 451 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సీసీ రోడ్లకు సంబంధించి 612 పనులు మంజూరు కాగా 49.51 శాతం మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లను కూడా నెలాఖరులకు పూర్తిచేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. రైతులకు సంజీవని వంటి పంట పొలాల్లో నీటి కుంటల (ఫార్మ్ పాండ్స్)పై అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ

కనిపిస్తే వాటిని సీజ్ చేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు. త్వరలో ప్రతి గ్రామ పంచాయతీ సెక్రెటరీ కి చికెన్ షాపులు పరిశీలించే విధంగా వారిని అప్రమత్తం చేస్తామని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో తెలంగాణ నుండి ఆంధ్రకు రవాణా చేస్తున్న కోళ్ల వ్యాన్లను తిప్పి పంపినట్లు వారు తెలిపారు.

## వాలీబాల్ లో సత్తా చాటిన వీరపనేనిగూడెం హైస్కూల్ విద్యార్థినులు



**గన్నవరం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** ఈ నెల 11 నుండి రెండు రోజుల పాటు ఉమ్మడి కృష్ణా జిల్లా అవనిగడ్డ ఉన్నత పాఠశాల లో జరిగిన కృష్ణా జిల్లా సెకండరీ పాఠశాల ల క్రీడల సీనియర్ విభాగంలో బాలికల వాలీబాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు గన్నవరం మండలం వీరపనేనిగూడెం ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు బుధవారం పత్రికలకు తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన జట్లతో పోటీ పడి వీరపనేనిగూడెం బాలికల జట్టు చక్కటి క్రీడా ప్రతిభ ప్రదర్శించడం తో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు వెంకటేశ్వరావు తెలిపారు. నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థినులను ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయమ విద్య సహాయకులు సి. హెచ్. బాల కృష్ణ ను ప్రధాన ఉపాధ్యాయుల తో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గన్నవరం జోన్ అధ్యక్ష,ఉపాధ్యక్ష, కార్యదర్సులు, పి. వెంకటేశ్వరావు, బి. యస్. రామ చంద్రుడు, యస్. వెంకటేశ్వరరావు, సలహాదారు యస్. సుబ్బారావు లు అభినందించారు.

## ఆడపడుచులతోసందడిగా మారిన కూడేరు



**పామర్రు ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** కావూరి వారి ఇలవేల్పు శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారి ఉత్సవ వేడుకలలో భాగంగా రెండవ రోజైన బుధవారం పమిడిముక్కల మండలం కూడేరులో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కావూరి వారి ఆడపడుచులతో సందడిగా మారింది. శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారి ట్రస్టు సభ్యుల పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ వేడుకలలో భా గంగా అక్కల ముత్తైదువుల వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఆ వంశీ యుల కోడళ్ళు కొనసాగించిన పూజా కార్యక్రమంతో మందిర ప్రాంగణం కళకళలాడింది. ఆడపడుచులకు చేసిన పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా లలిత పారాయణ చేస్తూ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారికి అష్టోత్తర సహస్త్రనామాలతో కుంకుమ పూజ నిర్వహించారు. గ్రామస్తులు సైతం అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమా నికి రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ఆ వంశీయులు తరలివచ్చారు.

# స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పోలింగ్ నిర్వహణకు ఆఫీసర్లదే కీలకపాత్ర






(మొదటిపేజీ తరువాయి)

అర్థం చేసుకోవాలన్నారు. ఈవీఎంల ఎన్నికకు, బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించే ఎన్నికలకు వ్యత్యాసాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ఏ స్థాయిలోనూ తప్పులు జరగరాదన్నారు. పోలింగ్ నిర్వహణకు జిల్లాలో 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 191 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగ రిజర్వ్ బాక్స్ లతో కలిపి 250 బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ సక్రమంగా పంపిణీ జరిగే విధంగా మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, టెంపరరీ స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను పరిశీలించుకొని ముందుగానే సిద్ధం చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి తీసుకున్న పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్టును, బ్యాలెట్ బాక్సులు పోలింగ్ అనువుగా ఉన్నది లేనిది సరిచూసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల సీరియల్ నెంబర్లు సరైన పద్ధతిలో ఉండేలా చూసకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల సీరియల్ నెంబరు వాటి కౌంటర్ పాయింట్ పై గల సీరియల్ నెంబర్లు చెక్ చేసుకోవటం తప్పనిసరి అన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లకు వేసే సీల్, టెంపరరీ స్ట్రాంగ్ రూమ్ లకు తరలించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు హ్యాండ్ బుక్ ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లు పర్యవేక్షణ చేస్తారని, ఏ స్థాయిలోనూ తప్పులు జరగకుండా జాగ్రత్త వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ కే. చంద్రశేఖర రావు పోలింగ్ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లకు వేసే సీల్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ లనుండి ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ మెటీరియల్ తీసుకోవటం,పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను, మెటీరియల్ ను టెంపరరీ స్ట్రాంగ్ రూమ్ కు తరలించడం తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు.

## దూలాస్ ట్రస్ట్ వారి సేవలు అభినందనీయం



**నందిగామ, మేజర్ న్యూస్:**మునగచర్ల గ్రామంలో బుధవారం నాడు దూలాస్ ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవ సహాయం సహకారంతో 6 వేల మందికి దుస్తులు, 25 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను కూటమినేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూలాస్ ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవ సహాయం చేస్తున్న సేవా కార్యక్రమాలు నిజంగా అభినందనీయమని సమాజ శ్రేయస్సుకై ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్ట్ వారిని మనస్పూర్తిగా అభినంది స్తున్నాను. ఇటువంటి మరెన్నో సేవా కార్యక్రమాలు భవిష్యత్తు రోజులలో చేపట్టాలని ఆకాంక్షిస్తూ ఇటీవల వారి ప్రథమ కుమారుడు వివాహం జరిగిన సందర్భంగా నూతన వరుడు మణి ఆనంద్, నూతన వధువు ఈఎస్ఐ వాస్తవ్యరాలు యాంబర్ ను వారి కుటుంబ సభ్యులతో కలసి అక్షింతలు వేసి ఆశీర్వదించారు

## ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 28 కల్లా ట్రేడ్ లైసెన్సులు చెల్లించండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** 2025 -2026 సంవత్సరాలకు వ్యాపారస్తులందరికి ట్రేడ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవాల్సినదిగా, నోటీసులు ఇవ్వగా, వాటిని ఫిబ్రవరి 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2025 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా నగరపాలక సంస్థకు సంబంధించిన వివిధ కౌంటర్‌లో లైసెన్సు రుసుమును కట్టించుకొనుచున్నారని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర బుధవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డిమాండ్ నోటీసును సంబంధించిన సచివాలయాలలో రెన్యువల్ చేయించుకుని లైసెన్స్ కి చెల్లించవలెనని అన్నారు. మార్చి 1, 2025 నుండి మార్చి 31, 2025 లోపు చెల్లించిన వారు అపరాధ రుసుము కింద లైసెన్సు ఫీజు రుసుములో 25% అపరాధ రుసుముగా చెల్లించవలెనని, ఏప్రిల్ 1, 2025 నుండి చెల్లించువారు లైసెన్సు ఫీజులో 50% అపరాధ రుసుమును చెల్లించవలెనని, కావున ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 28 ఫిబ్రవరి 2025 లోపున లైసెన్స్ ఫీజు చెల్లించవలసినదిగా కమిషనర్ కోరారు.

# తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలి



(మొదటిపేజీ తరువాయి)

జగ్గయ్యపేట మండలంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందులో భాగంగా అనుమంచిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని.. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు, ఉపయోగిస్తున్న ఎరువులు, వాటి లభ్యత తదితర వివరాలను రైతులను అడిగారు. రోజువారీ వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరాలేంటో తెలుసుకున్నారు. వ్యవసాయ యంత్ర పరికరాల అవసరాన్ని, కోతుల బెడద గురించి రైతులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులు తాము సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించేలా రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అగ్రీ కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి ఇప్పటినుంచే పంటలు, నేలలు, భూసారం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.



### పూర్తిస్థాయిలో పనిచేసేలా ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాలు

కలెక్టర్ లక్ష్మీశ జగ్గయ్యపేట మండలంలోని పోచంపల్లి గ్రామంలోని ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) పరిశీలించారు. సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాలో 286 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 264 ఎస్‌డబ్ల్యూపీసీలను పూర్తిస్థాయిలో పనిచేసేలా చూస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రాలు లేని 22 గ్రామ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేసి, నిర్వహణలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ వర్మీ సీడింగ్ జరిగేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ పోచంపల్లి గ్రామంలో డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన 2.5 కి.మీ. బీటీ రోడ్డును పరిశీలించారు. రోడ్లకు సంబంధించిన కొలతలు, రికార్డులను పరిశీలించారు. పర్యటనలో కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్ రమేష్, వ్యవసాయ శాఖ ఏడీ భవాణి, మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి తదితరులున్నారు.

# ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

## పెడన ఎమ్మెల్యేకాగిత కృష్ణ ప్రసాద్





**బంటుమిల్లి మేజర్ న్యూస్:** ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను గెలిపించేందుకు ప్రతి ఒక్క పట్టభద్రులు కృషి చేయాలని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం బంటుమిల్లి గ్రామంలో ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుడుగా కష్టపడి చదివి పైకి వచ్చిన ఉమ్మడి కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు గ్రాడ్యుయేట్స్ సమస్యలు తెలుసునని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు చట్టసభలలో పట్టుదలతో కృషి చేస్తారన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు ప్రథమ ప్రాధాన్యత ఓటు 1 అంకె వేసి భారీ మెజార్టీతో మన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను పట్టభద్రులు అందరూ గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో బీసీ చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు, కూనపురెడ్డి వీరబాబు, అంగర రంగనాథ్, ఇల్లూరి లీలాకృష్ణ, ఆకునూరి రత్నకుమార్, జొన్నగడ్డ కొండ, సుజ్ఞానం, సతీష్ కుటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పర్వతనేనికి ఘన నివాళి

**గుడివాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ స్టేడియం నిర్మాణంలో పర్వతనేని జగన్మోహన్రావు చేసిన కృషి మర్చిపోలేదని కమిటి ఉపాధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు యలవర్తి శ్రీనివాసరావు, కిలారపు రంగప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతిని పురష్కరించుకుని ఆయన విగ్రహానిక పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనతరం ఆయన స్టేడియం నిర్మాణానికి చేసిన కృషిని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలలో సభ్యులు పర్వతనేని ఆనంద్, స్టేడియం మేనేజర్, కోచేలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామికి గరుడ సేవ మహోత్సవం



**నందిగామ, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** పట్టణ శివారు పల్లగిరి కొండపై వెంచేసి యున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి గరుడ సేవా మహోత్సవం దేవస్థానంలో బుధవారం నాడు మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి గరుడ సేవా మహోత్సవం కార్యక్రమం నిర్వహించి 12 ద్వాదశ ప్రదక్షిణలు గావించి భక్త జన సందోహంతో రథంపై స్వామివారిని ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా గరుడ పక్షి దేవాలయం చుట్టూ ప్రదక్షణ గావించడం విశేషం ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం, తీర్థప్రసాదాలు అర్చకులు పరాశరం పవన్ కుమార్ పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమం తొర్లికొండ సీతారామయ్య దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## చిష్టి బాబా ఉసుమహోత్సవంలో ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ దర్గాలో జరిగిన హజరత్ జియావుల్ హక్లీమ అల్లా మొహిబుల్లా షా చిష్టి బాబా 81వ ఉరుసు మహోత్సవంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు కుమార్ రాజాకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కుమార్ రాజా చిష్టి బాబా సమాధి వద్ద పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ సమావేశంలో పాల్గొన్న సౌమ్య



**నందిగామ, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** విజయవాడ వెటర్నరీ కాలనీ, వెన్యూ కన్వెన్షన్‌లో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణ – గుంటూరు జిల్లాల తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మినిస్టర్ సత్యకుమార్ యాదవ్ తో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు కూటమీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## హోప్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** హోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు హోప్ ఆర్గనైజేషన్ సంస్థ వారు అందించిన అల్పాహారాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూపదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని ఈ సమయంలో విద్యార్థులు అలసటకు గురి అవ్వకుండా తగిన అల్పాహారం తీసుకుని చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హోప్ సమస్త ఫౌండర్ బి విశ్వభారతి, డైరెక్టర్ ఫణీంద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్ కు ధన్యవాదాలు తెలిపారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు 25 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం జె సాయిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె పవిత్ర కుమార్ పలువురు పాల్గొన్నారు.

## ఆలపాటి రాజాను గెలిపించండి : మైనేని ఇందిర



**పామర్రు ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్:** పామర్రు నియోజకవర్గం పరిధిలోని పెదపారుపూడి మండలం జవ్వనపూడి, అప్పికట్ల, చినపారుపూడి గ్రామాలలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మైనేని ఇందిర విస్తృతంగా పర్యటించి ఎమ్మెల్సీ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఎన్డీఏ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయవలసిందిగా కోరారు. గ్రామాల్లో పర్యటించి ఎమ్మెల్సీగా ఆలపాటి రాజాను గెలిపించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో నత్తా వాణి, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.




## ఐదు ఫాస్ట్ ఛానెళ్లను ప్రారంభించిన శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇండియా

**విజయవాడ మేజర్ న్యూస్ :** శామ్‌సంగ్ టీవీ ప్లస్, శామ్‌సంగ్ యొక్క ఫ్రీ యాడ్-సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీసు, శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇండియాలో ప్రత్యేకంగా ఐదు కొత్త ఫాస్ట్ ఛానెల్‌లను ప్రారంభించడానికి వార్నర్ బ్రదర్స్‌తో కలిసి పనిచేసింది. ఈ డబ్ల్యూబీటీవీ ఛానెళ్లు అధిక నాణ్యత, ఉచిత వినోదం కోసం డిమాండ్‌ను తీర్చడం ద్వారా స్ట్రీమింగ్ ప్రేక్షకులకు ప్రీమియం కథను అందిస్తాయి. హిందీ కార్యక్రమాలపై బలమైన దృష్టి సారించి, ఈ కొత్త ఫాస్ట్ ఛానెల్‌లు ప్రాంతీయ, పట్టణ ప్రేక్షకులను లీనమయ్యేలా చేయడానికి రూపొందించబడ్డాయి. శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇండియా పార్ట్‌నర్‌షిప్స్ అండ్ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ కునాల్ మెహతా ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విభిన్న శ్రేణి ప్రీమియం ప్రోగ్రామింగ్‌ను అందిస్తూ, శామ్‌సంగ్ స్మార్ట్ టీవీలు, మొబైల్ పరికరాల్లో వీక్షకులను ఆకర్షించడానికి ఈ చానెళ్లు రూపొందించబడ్డాయని పేర్కొన్నారు.

## కళాకారుల సమైఖ్య ఆధ్వర్యంలో పాటల పోటీలు



**గుడివాడ, మేజర్ న్యూస్ :** కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు బి. రామ్మోహన్రెడ్డి అధ్యక్షతన మంగళవారం రాత్రి స్థానిక అర్యవైశ్యా కాల్యాణ మండపంలో ఘంటాసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని పురష్కరిం చుకుని ప్రతేకంగా సంగీత విభావరి నిర్వహించారు. ఈ సంగీత విభావరిలో ప్రముఖ గాయని గాయకులు ఎ.సునీత, భానుమతి, మానస, టేకి నాగరాజు, శనగపాటి నాగేశ్వరరావు, ఆర్టీసీ శ్రీనివాసరావులు పాడిన పాటలు ప్రేక్షకులను అలరించారు. అనతరం 20 మంది కళాకారులకు నెల వారి అందించే రూ1000 పించనలను అందజేశారు. ఈ కార్యాక్రమంలో కళాకారుల సమాఖ్య అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ, కర్యదర్శి పి.ఎస్.బాబు సభ్యులు పాత శ్యాము, లోయ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ నాలెడ్జ్, సైన్స్ టాలెంట్ టెస్ట్‌లలో అస్సిసి విద్యార్థుల ప్రతిభ



**పామర్రు ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** పామర్రు అస్సిసీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జనరల్ నాలెడ్జ్, సైన్స్ టాలెంట్ టెస్ట్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ వలస సెబాస్టియన్ తెలిపారు. ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరులో నోబుల్ మైండ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో తమ విద్యార్థులు ముగ్గురు ఉత్తమ ప్రతిభను కనపరచి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు డి. తేజస్ కృష్ణ ప్రథమ స్థానం, ఎం. దర్శికారెడ్డి ద్వితీయ స్థానం, డి. శ్రీకర్ గాంధీ తృతీయ స్థానం పొందినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన ఈ విద్యార్థులను వైస్ ప్రోవెన్షియల్ సిస్టర్ లిల్లీ, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రోజ్ పి థామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ వల్సా సెబాస్టియన్, ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి బహుమతులను అందించారు.



## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ మేజర్ న్యూస్:** జేఈఈ మెయిన్స్ ఫేజ్-1లో 99.8% పర్సంటైల్ అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విజయవాడకి చెందిన అన్ అకాడమి విద్యార్థులను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం అన్ అకాడమి సెంటర్ అకడమిక్ హెడ్ నమ్మి నాగేంద్ర ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ అత్యధిక మార్కులతో సత్తా చాటిన విద్యార్థులు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిశారు. విద్యార్థులను ఎంపి కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాజా రామ కృష్ణ పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో కాశ్మీర్ టూర్

**విజయవాడ మేజర్ న్యూస్:** ఈ వేసవి కాలంలో 33 శాతం సబ్సిడీతో 'కాశ్మీర్ టూర్' విహార యాత్రికులకు మధురానుభూతి కలగజేయనున్నట్లు భారతీయ రైల్వే సౌత్‌స్టార్ రైల్ ప్రతినిధి విఘ్నేష్ తెలిపారు. ఇండియన్ రైల్వేలు, భారత్ గౌరవ్ ట్రైన్ ఆపరేటర్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ ఇండియాతో కలిసి కాశ్మీర్, ఆగ్రా, ఢిల్లీ, అమృతసర్ వంటి ప్రముఖ గమ్యస్థానాలకు వేసవి సెలవుల ప్రత్యేక రైలు టూర్ కలదన్నారు. ఈ 15 రోజుల ప్రత్యేక ప్యాకేజీ ఏప్రిల్ 2న ప్రారంభమవుతుందని తెలిపారు. బుకింగ్‌లు ఇప్పుడు ఓపెన్ అయ్యాయన్నారు. 1ఏసీ, 2ఏసీ, 3ఏసీ, స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్‌కీపింగ్, భద్రతా సిబ్బందితో అత్యంత సురక్షితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. సైట్‌సీయింగ్, హోటల్ వసతి, రాత్రి బస ఉంటుందన్నారు. ప్రయాణం అంతటా దక్షిణ భారతీయ భోజనం కలదన్నారు. పర్యాటక ప్రాంతాల సందర్శన సమయంలో లగేజీని కోచ్‌లో ఉంచే సౌకర్యం ఉందన్నారు. ఈ పర్యటన వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ 3ఏసీ రూ.49,900, 2ఏసీ రూ.60,100, 1ఏసీ రూ.65,500 కలదన్నారు. బుకింగ్ కోసం 7305858585 నంబరులో సంప్రదించాలని కోరారు..

## తడిచెత్త, పొడి చెత్తపై కార్యదర్శి మిర్జావాలి అవగాహన



**వీరులపాడు, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** మండలంలోని జుజ్జూరు గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద తడి చెత్త,పొడి చెత్త పై అవగాహన కార్యక్రమము ఏర్పాటు చేయడ మైనది అని గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి విలేకరులు తెలిపారు.బుధవారం జుజ్జూరు గ్రామంలో ఉన్న చెత్త కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి, తడి చెత్తను వర్మీ కంపోస్ట్ గా తయారు చేయడం జరుగుతుందని, ఈ వర్మి కంపోస్ట్ ను జుజ్జూరు గోల్డ్ వర్మి కంపోస్టు గా స్థానిక రైతులకు సప్లై చేయడం ఏర్పాట్లు చేస్తున్నామని, పంచాయితీ కార్యదర్శి షేక్. మీర్జావలి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. గ్రామంలో రిక్షాల ద్వారా తడి చెత్త, పొడి చెత్త ను వేరు వేరు గా ఇవ్వవలసినదిగా ప్రతి ఇంటి కి వెళ్ళి అవగాహన కలిగిస్తున్నామని ఆయన పేర్కొన్నారుఈ కార్యక్రమములో సర్పంచ్. రామావత్.కోటి, వీరుల్ల పాడు ఈ ఓ ఆర్ డి సీతారామరాజు,,వార్డు సభ్యులు కానూరు వెంకటేశ్వరరావు ఇతరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల మేరకు చెత్త నుండి వర్మి కంపోస్ట్ తయారు చేపట్టినట్లు జుజ్జూరు గ్రామ పంచాయితీ సెక్రెటరీ షేక్. మీర్జావలి ఈ సందర్భంగావిలేకరులు చెప్పారు.జుజ్జూరు గ్రామంలో చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమంలో భాగంగా వర్మి కంపోస్ట్ పిట్స్ దాదాపు 21 ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు.ప్రతిరోజు తడి చెత్త, పొడి చెత్తను గ్రామాల్లో సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద కు చెరవేస్తున్నట్లు తెలిపారు.వర్మి కంపోస్ట్ తయారు చేస్తున్నామని,ఆ తయారైన వర్మి కంపోస్ట్ ను రైతులు వినియోగించుకొని పంట పొలాలలో ఉపయోగించు కొనవలసినది గా ఆయన కోరారు.

# డీపీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా యండ్రాతి మల్లేశ్వరరావు నియామకం







**వత్సవాయి,ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** ఇటీవల విజయవాడ గాంధీ నగర్ లో డిపిఆర్టీయు రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో మాతృ సంఘం పిఆర్టియు 53వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా ఏపీ ఎన్జీవోస్ చైర్మన్ కె.వి శివారెడ్డి,ఏపీ ఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి ఏ.విద్యాసాగర్, లయన్ ముప్పులూరి ఉపేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీను మాట్లాడుతూ అనతి కాలములోనే ఉపాధ్యాయుల పలు సమస్యలపై పోరాడుతూ వత్సవాయి మండల శాఖ బలోపేతానికి కృషి చేస్తూ, సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్న యండ్రాతి మల్లేశ్వరరావు ని డిపిఆర్టియు రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేయడం జరు గుతున్నదన్నారు. మల్లేశ్వరరావు వృత్తిలో అంకి తభావం ,ఏ పాఠశాలలో పనిచేసిన ఆ గ్రామ పెద్దల మన్నలు పొందిన వ్యక్తి విద్యార్థులకు బోధనలో సులువైన మార్గంలో బోధించడం, విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీసే విధంగా బోధన పటిమను కలిగిన మల్లేశ్వరరావును మేము సభా ముఖంగా అభినందిస్తున్నాము. అలాంటి ఉపాధ్యాయులు మా యూనియన్ లో ఉన్నందు కు మేము చాలా గర్విస్తున్నమన్నారు. ఇలాంటి పని చాతుర్యం ఉన్న ఉపాధ్యాయులకు యూనియన్ పగ్గాలు ఇస్తే రాష్ట్రంలో మా యూనియన్ అభివృద్ధితో పాటు బలోపేతం చెందుతుందన్నా రు. తదనంతరం డిపిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ అజ్మీర్ శ్రీనివాసరావు మండల నాయకులు పాల్గొని యండ్రాతి మల్లేశ్వరరావు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న స్టేడియం ఆధ్వర్యంలో 10కె రన్



**గుడివాడ, మేజర్ న్యూస్:** పర్వతనేని జగన్ మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 16వ తేదిన 10కె రన్ నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యలవర్తి మాట్లాడుతూ ఈ నెల 16వ తేది ఉదయం 6గంటలకు జగన్మోహనరావు మెమోరియల్ అధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో పురుషులకు 10కె రన్, 6కె రన్. స్త్రీలు, బాలబాలికలకు, 4కె రన్ 12సం.లలోపు బాలబాలికలకు వేరువేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10కె రన్ లో విజేతలకు మెదటి బహుమతిగా రూ6.116, 2వ బహుమతిగా రూ4, 116, 3వ బహుమతిగా రూ.3,116, 4వ బహుమతి నుండి 6వ బహుమతులుగా 1,116, 7బహుమతి నుండి 10వ బహుమతులుగా 516, 11 నుండి 15 వరకు ఒక్కోరికి 316లు అందించడం జరుగుతుందన్నారు. 6కె, 4కె రన్లో విజేతలకు కూడ నగదు పురస్కరం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే సభ్యులు స్టేడియంలో వారి పేర్లులను ఈ నెల 15తేది లోపు నమోదు చేసుకోవలన్నారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటి సభ్యులు పర్వతనేని ఆనంద్ పాల్గొన్నారు.

## టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించండం అభినందనీయం



**గుడివాడ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని టిడ్కో కాలనీలో పెరిగిపోతున్న చెత్తను తొలగించడానికి కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ కు బిజెపి పట్టణాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అభినందనలను తెలిపారు. టిడ్కో కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమం చేసి ఆ సమస్యలను మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేయడంతో సిబ్బంది స్పందించి వెంటనే చెత్తను తొలిగించినందుకు బిజెపి పట్టణాధ్యక్షుడు ఆర్కే ప్రత్యేక ధన్యవాదలను తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా నాయకురాలు బోనం గోపిక, నాయకులు లంక రాంబాబు, రిట, చరణ్, టిడ్కో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## చేతన ఫౌండేషన్ సంస్థ ద్వారా సమాజంలో మరిన్ని సేవలు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** పట్టణంలోని నెహ్రూ నగర్ కమ్మ కళ్యాణ మండపంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేతి వృత్తిపై ఆధారపడి పని చేసే వారికి బాసటగా నిలిచారు. చిరు వ్యాపారాలు నిర్వహించుటకు 40 తోపుడు బళ్లు, 10మంది మహిళలకు కుట్టు మిషన్లు 10 పిండి రుబ్బే గ్రైండర్స్ చేతన ఫౌండేషన్ ద్వారా చేత ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగండ్ల రవికుమార్ మంగళవారం నందిగామలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య హాజరయ్యారు. సౌమ్య చేతుల మీద అర్హులైన పేద చిరు వ్యాపారస్తులకు తోపుడు బళ్ళు కుట్టు మిషన్ గ్రైండర్ అందజేశారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ సంస్థ ద్వారా సమాజంలో మరిన్ని సేవలు నిర్వహించటానికి ముందడుగు వేస్తున్నారని తెలిపారు. చేతన ఫౌండేషన్ ద్వారా కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. చాలామంది ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## బండి రామకృష్ణను సత్కరించిన గంగానమ్మ తల్లి ఆలయ ధర్మకర్తలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈడేపల్లి గంగానమ్మ తల్లి ఆలయ పునః నిర్మాణ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు ఈరోజు గంగానమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పుణ్య దంపతులచే వేద పండితుల మంత్రోచ్చారణలతో హోమాలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు అందజేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణను గంగానమ్మ తల్లి ఆలయ ధర్మకర్తలు రామకృష్ణ ను సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో బండి రామకృష్ణ పాల్గొని భక్తులకు అమ్మవారి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ డివిజన్ ఇంచార్జ్ మహమ్మద్ షాహినా బేగం, జనసేన నాయకులు దేవనూరి,వీరబాబు,మహమ్మద్,సమీర్, గద్దంరాజు, గణేష్, మైఖేల్, ఆలయ ధర్మకర్తలు బ్రహ్మయ్య, మురాల రాంబాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజం కోసమే మారథాన్, వాకథాన్

## కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి





**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు మారథాన్, వాకథాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎ.పి కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ ' కస్టమ్స్ డే ' సందర్భంగా బుధవారం పి.డబ్ల్యూ.డి గ్రౌండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మారథాన్, వాకథాన్ కార్యక్రమాలకు కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ..ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం అన్ని శాఖల కేంద్ర ఉద్యోగులను ఏకం చేయడమే మారథాన్, వాకథాన్ ల ముఖ్య ఉద్దేశమన్నారు. పని ఒత్తిడి గల ఉద్యోగులు ఆరోగ్యకరమైన భవిష్యత్ లోకి అడుగుపెట్టడానికి పరుగు, నడకలు దివ్య ఔషధలావంటివన్నారు. ఇవి అందరి జీవితాలలో భాగం కావాలన్నారు. ప్రపంచ వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో కస్టమ్స్ పోషించిన పాత్రను నొక్కి చెప్పడానికి, ప్రభుత్వ అధికారులలో ఆరోగ్యం, శ్రేయస్సు, సహకారాన్ని ప్రోత్సహించడంలో ఒక అడుగు ముందుకు వేయడానికి ఈ కార్యక్రమం ఇక అద్భుతమైన అవకాశం గా భావిస్తున్నామన్నారు. బి.ఎస్.ఎన్.ఎల్ అధికారి ఎం.శేషాచలం మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఐక్యత, ఫిట్ నెస్, వేడుకల స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. రీజినల్ పాస్ పోర్ట్ అధికారి శివహర్ష మాట్లాడుతూ..ఇది ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుకొనే గొప్ప ఉద్యమం అన్నారు. తొలుత నరసింహారెడ్డి, శేషాచలం, శివహర్ష లు ఆకాశంలోకి పావురాళ్ళు, బెలూన్లు ఎగరవేసి, కార్యక్రమాలు ప్రారంభించారు. పరుగు, నడక పోటీలలో కస్టమ్స్ ఉద్యోగులే కాకుండా, సెంట్రల్ జి.ఎస్.టి, పాస్ పోర్ట్, కాగ్, పోస్టల్, ఆదాయపు పన్ను, అర్.పి.ఎఫ్, సి.పి.డబ్ల్యూ.డి, బి.ఎస్.ఎన్.ఎల్ వంటి 25 శాఖలకు చెందిన దాదాపు 300 ఉద్యోగులు హాజరై, తమ ఐక్యత, ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన విజయవాడ రన్నర్స్, యోధ పెడ్లర్స్, ఐ.టి.సి, గుంటూరు ట్రెక్కింగ్ కింగ్స్,బెజవాడ బ్యాక్ ప్యాకర్స్,జిల్లా పరిపాలన, కార్పొరేషన్, పోలీసు తదితర శాఖలకు, వివిధ సంస్థలకు కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ కాకరాల ప్రశాంత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ముత్యాలమ్మ తల్లి 23వ జాతర ముగింపు







**అమరావతి మేజర్ న్యూస్ :** ఈనెల 3 వ తేదీ నుండి 11 వ తేదీ మంగళవారం వరకు జరిగిన దుమ్ముగూడెం ముత్యాలమ్మ తల్లి జాతర ముగించారు. అమ్మవారి జాతరలో తొమ్మిది రోజులలో మూడు పర్యాయాలు అమ్మవారి ప్రతిరూపాలైన గరగరలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేష ధారణలతో గ్రామ పుర వీదుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తులు అందించిన ప్రసాదాలు, మంగళ హారతులు అమ్మవారికి సమర్పించారు. ఈ రోజు ఆఖరి రోజున గరగరల ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా కళాకారులచే కాంతారా సెట్టింగ్స్ తోపాటు భద్రకాళీ నృత్యాలు, గిరిజన నృత్య ప్రదర్శన కొమ్ము డ్యాన్సులు, డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలు, బాణా సంచాల నడుమ చివరి వూరేగింపు జరిగింది. వివిధ ప్రాంతాలనుండి దుమ్ముగూడెం వచ్చిన భక్తులు ఆనందంతో పరవశించిపోయారు. అమ్మవారి ఆలయ కమిటీ, భక్త బృందం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ జాతర భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు ప్రారంభించారు.

సోమవారం రోజున పినపాక శాసన సభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొన్నారు. పలువురు రాజకీయ నాయకులు కూడా పాల్గొని అమ్మవారికి తొమ్మిది రోజులు పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ 23 జాతర ఘనంగా ప్రశాంతంగా ముగింపు జరగడంపట్ల ఆలయ కమిటీ ఆనందం వ్యక్తం చేసింది.

# పేదలకు ఉచిత వైద్యం అందించడం సంతోషం







## శంకర ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయం

## ఉచిత కంటివైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కంటి చూపు సంరక్షణ విషయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని లలితా కన్వెన్షన్లో కొల్లు ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన ఇంఛార్జి బండి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించే లక్ష్యంతో ముందుకొచ్చిన శంకర ఐ హాస్పిటల్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఇప్పటికే 350కి పైగా క్యాంపులు నిర్వహించి దాదాపు నాలుగున్నర లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం, గుంటూరులో ఉన్న ఆస్పత్రిలో వైద్యం చేయడం హర్షణీయం. ముఖ్యంగా కేటరాక్ట్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు ఉచితంగా సర్జరీలు కూడా చేయడం వారి సేవా భావానికి నిదర్శనం అన్నారు. ప్రజలు కూడా కంటి చూపు విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయడం ద్వారా మాత్రమే కంటి చూపును రక్షించుకోవచ్చన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణ మనసుకు అత్యంత ప్రశాంతతను కలిగిస్తోందన్నారు. కరోనా సమయంలో స్పర్శ ఫౌండేషన్ ద్వారా పేదలకు ఉచితంగా మందులు,కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లు ఫౌండేషన్ ప్రతినిధి కొల్లు పునీత్ చంద్ర, ఫీనిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి చుక్కపల్లి అవినాశ్,శంకర కంటి ఆస్పత్రి ప్రతినిధి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరావు,తెలుగు యువత అధ్యక్షుడు సలీం, అయ్యప్ప, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఇటీవల మృతి చెందిన సీనియర్ భవన నిర్మాణ కార్మికుడు రాజనాల గోపాలకృష్ణ కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం 8 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. గోపాలకృష్ణ దశదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం భవన నిర్మాణ కార్మిక నాయకులు యాసం శ్రీనివాసరావు, అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మాదాసు కుమార్, పెనుమూడి చంద్రశేఖర్, బండారి నాగభూషణం రాజనాల వీరబాబులు ఐదవ వార్డులోని గోపాలకృష్ణ నివాసానికి వెళ్లి గోపాలకృష్ణ చిత్ర పటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులకి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు







**కంచికచర్ల ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** మాఘ పౌర్ణమి విశిష్టమైన రోజు కావున బుధవారం తెల్లవారుజామున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఇష్టదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పితృదేవతలను తలచు కునేందుకు అనువైన రోజు మాఘ పౌర్ణమి పర్వదినం. ఈ పర్వదినాన సూర్యుడిని మహాలక్ష్మిని పూజించడం వల్ల విశేషమైన ఫలితం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. స్నానాలలోకెల్లా మాగ పౌర్ణమి స్నానం ఉత్తమం అని పురాణాలు వివరిస్తున్నాయి.బాగా నక్షత్రానికి అధిపతి బృహస్పతి కాబట్టి ఈరోజున పురోహిష్పత్తిని పూజిస్తే ఆయన కరుణ లభిస్తుందని కూడా పురాణాలు చెబుతున్నాయి.గొట్టుముక్కల గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వసంత వేణుగోపాల స్వామి దేవాలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి కి విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇష్టదేవతలను పూజించారు. మాఘ స్నానం చేసిన భక్తులు దేవాలయానికి వచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవాలయ పూజారి ముత్తేవి కేశవాచార్యులు స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## కొత్తపేట చెవిటికల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**కంచికచర్ల ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** మండలంలోని కొత్తపేట, చెవిటికల్లు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంట నమోదు అవశ్యకత, సబ్సిడీ అందుబాటులో ఉన్న కిసాన్ డ్రోన్ గురించి, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు చేయటం జరుగుతుంది అని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, విద్యార్థులు, రైతుల తో కలిసి మొక్కజొన్న పొలం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ ఆధికరి కె. విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి నీలిమా, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గ ప్రసాద్, రుచి పాల్గొన్నారు.





## గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపిక

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక గుడ్లవల్లేరు లోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కళాశాల యందు దివిస్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ బీఫార్మసీ ఆఖరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో భాగంగా మొదటి దశలో రాత పరీక్షను రెండవ దశలో టెక్నికల్ ఇంటర్వ్యూను నిర్వహించారు. కళాశాల విద్యార్థులు దాదాపు 20 మందికి పైగా ఈ రెండు రౌండ్స్ లో విజయం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఏ లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులకు ప్రొడక్షన్, క్వాలిటీ ఎస్యురెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగంలో శిక్షణ ఇచ్చి తగిన పోస్టుకు ఎంపిక చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణ్ రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి ఎస్కే నాగుల్ మీరావలి ఉద్యోగం సాధించిన విద్యార్థులను అభినందించారు.

## బాపనయ్య కుటుంబ సభ్యులను పరామర్శ



**పామర్రు ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్:** తోట్లవల్లూరు మండలం గుర్విందపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుర్రం విజయలక్ష్మి తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం బాపనయ్యల కుమారుడు గుర్రం వేణునాగు ఇటీవల మృతి చెందగా బుధవారం జరిగిన పెదకర్మ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నా రు. రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తోట్లవల్లూరు మండలతెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లుక్కా రేణుకారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మడి కోటేశ్వర్రావు, బూత్ కన్వీనర్ తుమటి అదిశేషు, కార్యదర్శి చాగంటిపాటి నాగరాజు, రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి వెంకటరామయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తెలుగుదేశం పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఘనంగా నాంచారమ్మ సంబరాలు

### అమ్మవారికి మండలి వెంకట్రామ్ ప్రత్యేక పూజలు



**చల్లపల్లి మేజర్ న్యూస్:** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో శ్రీ లక్ష్మీ నాంచారమ్మ అమ్మవారి వార్షిక సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఆలయాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శివ సుబ్రహ్మణ్యం, వేద పండితులు శుద్ధపల్లి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి కోటేశ్వరరావు, అడుసుమిల్లి ఆంజనేయులు, అడుసుమిల్లి చంద్రశేఖర శాస్త్రి, పోపూరి చైతన్యకువ అమ్మవారి ఆశీస్సులు అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన అద్భుతంగా సాగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన వెంకట్రామ్ కు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## గ్రాడ్యుయేట్ యం ఎల్ సీ ఎన్నికల గురించి ఇంటింట ప్రచారం చేస్తున్న బూరగడ్డ వేదవ్యాస్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 27వ తేదీన జరుగబోవు ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ యం ఎల్ సీ ఎన్నికల గురుంచి ఇంటింట ప్రచారం చేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్,టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ బుధవారం నిడదవోలు నియోజవర్గంలో 7వ వార్డ్ వడ్డీల వీధిలో పేరాబత్తుల రాజశేఖర్ కు ప్రథమ ప్రాధాన్యత ఓటు 1 అంకె వేసి భారీ మెజార్టీతో అందరూ గెలిపించాలని కోరుతున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలి




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలురైతుల సంక్షేమం, రక్షణ కోసం తక్షణమే నూతనంగా సమగ్రమైన కౌలుచట్టాన్ని తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కౌలురైతుల సంక్షేమానికి, రక్షణ కోసం తక్షణమే నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ కృష్ణా జిల్లా చల్లపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు.అనంతరం రైతు,కౌలురైతులసంఘం ప్రతినిధి బృందం రెవిన్యూ ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తివుతున్న ఇంతవరకు కౌలు చట్టాన్ని తీసుకురావడంలో విఫలమైందని విమర్శించారు. చట్టం లేకపోవడం వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు,బ్యాంకులు ఇచ్చే పంట రుణాలు కౌలురైతులు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కౌలురైతులు ఉంటే కౌలు గుర్తింపు కార్డులు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. భూ యజమానులు కౌలుకు సాగు చేస్తున్న కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇప్పించకుండా తమ సమీప బంధువులకి గుర్తింపు కార్డులు ఇప్పించుకుంటున్నారని, ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీలో కౌలురైతులకు రూ.3820 కోట్ల రూపాయలు పంట రుణాల కింద ఇచ్చామని చెప్పటం వట్టి బూటకం అన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేవని, పంటరుణాలు ఇవ్వలేదని అలాంటప్పుడు ఇచ్చిన పంటలు రుణాలు బినామీ వారే పొందారని అన్నారు. బినామీ కౌలుగుర్తింపు కార్డులు కలిగిన వారికి పంట రుణాలు ఇచ్చి కౌలురైతులకు ఇచ్చామని చెప్పుకోవటం సిగ్గుచేటు అన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం పండించిన పంటలను "ఈ" పంటలో నమోదు చేసుకోలేకపోయారన్నారు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలను అమ్ముకోలేక మధ్య దళారులకు అమ్ముకొని నష్టపోయారన్నారు. కౌలు రైతులకు బ్యాంకులు పంటరుణాలు ఇవ్వటం లేదని దీంతో అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పంటలు పండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కౌలురైతుల పట్ల ఏమైనా చిత్తశుద్ధి ఉంటే వెంటనే నూతన కౌలురైతుల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు తలారి రామారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు, కౌలురైతుల సంఘం నాయకులు గోగినేని రత్తయ్య, లంక నాగమల్లేశ్వరరావు, ఏ ఐ వై ఎఫ్ అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు సిద్దా బత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఖాదర్ బాబా ఉరుసు మహోత్సవాలు



**ఏ కొండూరు, మేజర్ న్యూస్:** విజయనగరం బాబా మెట్ట లో వేంచేసి ఉన్న సూఫీ హజరత్ సయ్యద్ ఖాదర్ షా ఖాదర్ బాబా ఔలియా వారి 66వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ మహోత్సవానికి చీమలపాడు ఏఏ ఎం టి కె దర్బార్ సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి తనయులు దర్బార్ పీఠాధిపతి సజ్జాదానశీన్ మహమ్మద్ ఖాజా మోయుద్దిన్ షా తాజ్ ఖాదరి బాబా వారి ఆధ్వర్యంలో భక్త బృందంతో చీమలపాడు నుంచి విజయనగరం వెళ్లి అక్కడ జరిగిన ఉరుసు మహోత్సవాల్లో పాల్గొని మేళ తాళాలతో అంగరంగ వైభవంగా డప్పు వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అన్నదానం నిర్వహించారు. విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్ బాబు ఆధ్వర్యంలో ఈ ఉరుస్ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో దేశ నల మూలాల నుండి తెలుగు రాష్ట్రాల నుండి అశేష సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఖాదర్ బాబా దర్గాలో చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు అధికారులు ఈ వేడుకల్లో బాబా దర్గాను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించారు. దర్బార్ పీఠాధిపతి ఖలీల్ బాబు చేస్తున్న సేవలు గూర్చి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. మూడు రోజులు నిర్వహించిన ఈ మహోత్సవాల్లో భక్తులకు దివ్య అన్న ప్రసాదాన్ని అందించారు. చీమలపాడు బాబా భక్త బృందం అహర్నిశలు శ్రమించి భక్తులకు అవసరమైన సేవలు అందించారు. చీమలపాడు దర్గాలో మూడు రోజులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్ బాబు భక్తులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా పొన్నూర్ లో శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారిని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న డాక్టర్ శ్రీనివాసరావు కుమార్తె వివాహ కార్యక్రమములో పాల్గొన్నారు. ఆయనతోపాటు పీఏ మూర్తి మల్లుల కేదారేశ్వర రావు తదితరులు ఉన్నారు.



## వైభవంగా శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్మోత్సవాలు

**పెడన,మేజర్ న్యూస్:** దేవాంగ కుల మాతృకం శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్ మహోత్సవాలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మేరకు స్థానిక బ్రహ్మపురములో శ్రీ రామలింగ చౌడేశ్వరి భజన గుడి వద్ద ఊటుకూరి ఏక్నాథ్ సుధీర్ కుమార్ హేమ కనకదుర్గ నాగరాణి దంపతులచే నిర్వహించారు. ఈ మహోత్సవాలు మంగళవారం తెల్లవారుజామున ఆన పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం కుల భక్తులు కుమరకం ఊరేగింపుతో ఆలయం వద్దకు బాణాసంచి కాల్చుకుంటూ చేరుకున్నారు. అమ్మవారు ఒక జ్యోతి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ యొక్క అమ్మవారి జ్యోతి ప్రజ్వలన మంగళవారం రాత్రి 12 గంటల 55 నిమిషాలకు ప్రారంభం అయ్యి పట్టణంలో ప్రధాన రహదారుల గుండా ఊరేగింపుగా బయలుదేరారు. ఈ జ్యోతి ఊరేగింపు ముందు దేవాంగ కుల భక్తులు అలుగు సేవ పరాకు (రక్త తర్పణ) చేశారు. అనంతరం బుధవారం ఉదయం వరకు పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తూ ఆన పూజ కార్యక్రమానికి విముక్తి కలిగించారు. అనంతరం చలువ పందిళ్ళల్లో సుమారు 25వేల మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బందర్ ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి చప్పిడి రాజా ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐ సత్యనారాయణ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు.

## నిరుపేదలకు నిత్యవసరాలు వితరణ



**ఘంటసాల, మేజర్ న్యూస్:** రెడ్డిగారి, మధర్, హెల్ప్, హాండ్. సొసైటి (అండ్) బేతని చర్చి లో నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు ఇన్చార్జి పోతన వెంకట కృష్ణారావు బుధవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన ఘంటసాల వారి కార్యాలయావరణంలో నిరుపేదలైన అర్హత కలిగిన, వృద్దులు, వికలాంగులు, వితంతువులకు, 10 వస్తువులు కలిగిన రేషన్ కిట్టుగా ఎంతోమందికి పంపిణీ చేయుటం జరుగుతుందన్నారు. అలాగే దీనితో పాటుగా, దైవ సేవకులకు హంగర్ ఫండ్, కుట్టు మిషన్ నేర్పి, మిషన్లు, ఇవ్వడం, ఇలా అనేకమైన సేవా కార్యక్రమాలు, మా సంస్థలు నిర్వహించ బడుతున్నాయని, సంస్థల. ఇన్చార్జ్, పోతన వెంకటకృష్ణారావు తెలిపారు.

# భారీ మెజార్టీతో ఆలపాటి గెలుపు ఖాయం




ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)




## ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎన్డీయే కూటమి నేతల ఆత్మీయ సమావేశం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లా ఎన్డీయే కూటమి బలపరిచిన ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేం ద్ర ప్రసాద్ గెలుపు ఖాయమని, ఎన్టీఆర్ జిల్లాలో భారీ మెజార్టీ వస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల ఎన్డీయే కూటమి బలపరిచిన ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్య క్షుడు నెట్టెం రఘురామ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎన్డీయే కూటమి నేతల ఆత్మీ య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేయించుకున్న గ్రాడ్యుయేటర్ల ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమం చురుగ్గా సాగుతుందన్నారు. ఎన్డీయే కూటమి నేతలు ప్రతి 30 మంది ఓట ర్లకు ఒక పరిశీలకుడిని నియమించి మ్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటును ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు వేసేలా క్షేత్రస్థాయిలో కూడా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రులను కచ్చితంగా పోలింగ్ బూత్ కి తీసు కువచ్చి ఓటు వేయించే విధంగా కూటమి నాయకులు కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. ఆలపాటి రాజా వంటి మేధావులు శాసనమండలిలో ఉండా లన్నారు. ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు ఈ ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ గ్రాడ్యుయేట్స్ ఓటర్లను చైతన్య చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పుష్పగుచ్ఛం అందించారు. కనపర్తి శ్రీనివాసరావు ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమా మహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కోలిక పూడి శ్రీనివాసరావు, శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, ఎమ్మెల్సీ అశోక్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఏపీ స్టేట్ మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ఎపి వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్.ఎస్. బేగ్ లతో పాటు ఎన్టీఆర్ జిల్లా కృష్ణాజిల్లా ఎన్. డి. యే కూటమి నేతలు, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు అబ్జర్వర్లు పాల్గొన్నారు.

# ప్రత్యర్థులు ఎవరైనా ప్రగతి వైపే పట్టభద్రులు






**విజయవాడ తూర్పు మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని ప్రాముఖ్యత పథంలో నడిపిస్తున్నకూటమి ప్రభుత్వా నికి మంచి ఆదరణ ఉందని అందువల్ల ప్రత్యర్థి ఎవరైనా ప్రగతి వైపే పట్టభద్రు లు ఉన్నారని గుం టూరు కృష్ణా జిల్లాల పట్టభద్రులు ఎమ్మె ల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధ వారం ఉదయం పటమట రైతు బజార్ సమీపంలోని చెన్ను పాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆలపాటి రాజేం ద్ర ప్రసాద్ టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తాను ఏ ప్రాంతానికి వెళ్లినా పట్టభద్రులు అపూర్వ స్వాగతం పలుకుతూ తమ ఇంటిలో మనిషిలాగా ఆదరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మంచి పాలన ఇచ్చిన దున్న వ్యక్తులతో సంబంధం లేకుండా పట్టభద్రులు ప్రగతికి అండగా ఉండి మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు. తూర్పు నియోజకవ ర్గంలో ఓటరు నమోదు నుంచి ప్రచారం వరకు ఎంతో ఉత్సాహంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తు న్నారన్నారు. గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నత విద్యావంతుడని, న్యాయ వాదిగా కూడా పనిచేశారని అటువంటి వ్యక్తి పెద్దల సభలో ఉంటే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఆలపాటి రాజేం ద్ర ప్రసాద్‌కు వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆయన గెలుపు నల్లేరు పై నడకేనని అన్నారు. కానీ ప్రతి ఒక్కరు కూడా ఈ నెల 27వ తేదీని తమ క్యాలెండరు రౌండ్ ఆఫ్ చేసుకుని తప్పని సరిగా ఓటును వినియోగించుకోవాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఎనిమిది నెలల మంచి పాలనకు గుర్తింపుగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజార్టీ అందించాలన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మంచి మెజార్టీ తెచ్చేందుకు ఈనెల 27 వరకు కూటమి శ్రేణులు అంతా ఒక యజ్ఞం లాగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు రాజేష్, చెన్నుపాటి గాంధీ, చెన్ను పాటి ఉషారాణి, పొట్లూరి సాయిబాబు, జాస్తి సురేష్, పి.అజయ్, పేరేపి ఈశ్వర్, పొట్లూరు దర్శిత్, టి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక బృందాల ప్రొఫైలింగ్‌ను 15 కల్లా పూర్తి చేయండి

### కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 15 కల్లా స్వయం సహాయక బృందాల ప్రొఫైలింగ్ ను పూర్తిచేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం పెజ్జోనిపేట, పూర్ణానంద పేట, హౌర్ట్ పేట, పప్పుల మిల్ ప్రాంతంలో గల సచివాలయా లను సందర్శించి ఆర్.పి లు చేస్తున్న ఆన్లైన్ ఎస్. హెచ్. జి ప్రొఫైలింగ్ ను





పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల సభ్యుల వివరాలను ఆన్లైన్ చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, ఫిబ్రవరి 15 కల్లా వారి పరిధిలో ఉన్న అన్ని బృందాల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. పెజ్జోనిపేట నివసిస్తున్న మురళీకృష్ణ నివాసంలో సూర్య ఘర్ లో భాగంగా ఇన్స్టాల్ చేసిన సోలార్ ప్యానల్స్ ను పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి ) పి వెంకటనారాయణ యు సి డి సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబును కలిసిన ఎంపీ కేశినేని (చిన్ని)

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అమరావతి రాజధానిలో ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీకి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటీ శాఖ ల మంత్రి నారా లోకేష్‌లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి బుధవారం ఉండవల్లిలోని వారి నివా సంలో కలిశారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నేతృత్వంలో పాపుల్యాస్ గ్లోబల్ ఆర్కిటెక్స్ ప్రతినిధి సిద్ధార్థ్, ఎన్.వి.ఆర్కిటెక్స్ ప్రతినిధి వెంకట్, ఐబిఎస్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ కన్సల్టేషన్స్ కంపెనీ ఎండి వడ్లమూడి హర్ష సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను కలిశారు.

## ఎంపీచిన్నిను కలిసిన ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి



**విజయవాడ తూర్పు మేజర్ న్యూస్ :** ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ను ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధ వారం ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిసి పూలమొక్క అందించారు.. అనంతరం ఇరువురు కాసేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించుకున్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన ఎగ్జిబిషన్ పరిశీలన

### త్వరిత చర్యలతో అగ్ని ప్రమాదాన్ని అదుపులోకి తెచ్చిన అధికారులు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం మధ్యాహ్నం విద్యాధరపురం, సితార సెంటర్‌లో జరిగిన కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్ అగ్ని ప్రమాద స్థలాన్ని సంద ర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో శీఘ్రంగా చర్యలు తీసుకు న్నారని, మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ ఇంజిన్ ఉపయోగించి, శీఘ్రమైన చర్యలు చేపట్టి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. సంబం ధిత అధికారులపై కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఎస్టేట్ ఆఫీసర్, రిజిన ల్ ఫైర్ ఆఫీసర్, జోనల్ కమిషనర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసారు.



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999